గ్రూప్-1 అంతా సక్రమమే!

రిజర్వేషన్ నిబంధనల మేరకే మెయిన్స్‌కు ఎంపిక చేశాం

- జనరల్ మెరిట్‌లో అన్ని కులాల వారినీ తీసుకున్నం
- అభ్యర్థుల అనుమానాలపై అధికారవర్గాల వివరణ
- ఏ ఒక్కరికీ అన్యాయం జరగబోదంటూ భరోసా

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ ఎంపిక జాబితాపై అభ్యర్థులకు ఎన్నో సందేహాలు. ఓపెన్‌లోనే కటాఫ్ చేశారని, దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరిగిందన్నది ఆ అభ్యర్థుల ప్రధాన ఆరోపణ. ఎక్కువ మందిని ఓపెన్ కోటాలో ఎంపిక చేశారని, దీంతో సామాజిక న్యాయం జరగలేదన్నది వారి అనుమానాలు. అధికారవర్గాలు మాత్రం వీటిని కొట్టిపారేస్తున్నాయి. ఇది పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేస్తున్నాయి. జీవో-29 రిజర్వేషన్లకు విరుద్ధంగా లేదని, రిజర్వేషన్ విధానాన్ని పాటిస్తూనే మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేశామని అధికారులు తేల్చి చెప్తున్నారు. జనరల్ మెరిట్‌ను అంతా ఓపెన్ అనుకుంటున్నారని స్పష్టత ఇచ్చారు. అభ్యర్థులు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని పేర్కొంటూ, వారి సందేహాలపై అధికారవర్గాలు ఇచ్చిన వివరణలు ఒక్కోదానిపై ఈ కింది విధంగా సవివరంగా ఉన్నాయి.

• అభ్యర్థుల సందేహం

> గ్రూప్-1 మెయిన్స్ ఎంపికలో సామాజిక న్యాయం జరగలేదు. రిజర్వేషన్లు పాటించకపోవడం, ఓపెన్ కటాఫ్ ప్రకారం ఎంపిక చేయడంతో ఎస్సీ, ఎస్సీ, బీసీల రిజర్వేషన్లకు తూట్లు పొడిచారు.?

అధికారుల వివరణ

అలాంటిదేం జరగలేదు. జీవో-29లోనూ రిజర్వేషన్లు పాటించాలనే ఉన్నది. మొదట జనరల్ మెరిట్ ప్రకారం ఎంపిక చేశాం. ఆ తర్వాత ఏ సామాజిక వర్గానికి ఎన్ని పోస్టులుంటే అన్ని పోస్టుల ప్రకారం 1:50 ప్రకారం ఉన్నారో లేదో చూశాం. షార్ట్‌ఫాల్ ఉంటే కింది నుంచి అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేశాం. ఉదాహరణకు మల్టీజోన్-1లో బీసీ (ఏ) క్యాటగిరీలో 5 పోస్టులుంటే 250 మంది బీసీ (ఏ) అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉన్నది. ఓపెన్ మెరిట్‌లో 190 మంది మాత్రమే ఎంపికై ఉంటే, బీసీ (ఏ) సామాజిక వర్గానికి చెందిన మరో 60 మందిని మెరిట్ ప్రకారం ఎంపిక చేశాం. అన్ని సామాజిక వర్గాలకు ఇదే ఫార్ములా పాటించాం. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నుంచి మెయిన్స్‌కు ఎంపిక చేయడంతో ఇదే విధానాన్ని పాటించాం.

• అభ్యర్థుల సందేహం

> జనరల్ మెరిట్ అంటే అంతా ఓపెన్ క్యాటగిరీ అభ్యర్థులే అయ్యి ఉండొచ్చు కదా?

అధికారుల వివరణ

ఇది పూర్తిగా తప్పు. జనరల్ మెరిట్ అంటే పూర్తిగా ప్రతిభావంతులని అర్థం. ఈ ప్రతిభావంతుల్లో అత్యధికులు ఎస్సీలు, ఎస్టీలు, బీసీలూ అయి ఉండొచ్చు. వీరంతా పూర్తిగా మెరిట్ అభ్యర్థులని అర్థం. మెరిట్‌లో ఏ కులాల వారు ఉన్నా తీసుకున్నాం.

• అభ్యర్థుల సందేహం

> జనరల్ మెరిట్‌లో ఒక క్యాటగిరీలో పోస్టులకు మించి అభ్యర్థులు ఉంటే తొలగిస్తారా?

అధికారుల వివరణ

అలా అస్సలు జరగదు. వారంతా మెరిట్ వారు కనుక తొలగించడం ఉండదు. పోస్టుల సంఖ్యకు తగిన నిష్పత్తిలో అభ్యర్థులు ఎంపిక కాకపోతే మాత్రం మెరిట్ ఆర్డర్‌లో కింద ఉన్న అభ్యర్థులను ఎంపిక చేస్తాం.

• అభ్యర్థుల సందేహం

> జీవో-55ను ఎందుకు రద్దు చేశారు. కొత్తగా జీవో-29ని ఎందుకు తెచ్చారు?

అధికారుల వివరణ

గతంలో గ్రూప్-1 నియామకాల కోసం మెయిన్స్ ఎంపిక కోసం కులాలతో సంబంధం లేకుండా మెరిట్ ప్రకారం 1:50ని ఎంపిక చేయాలని 1997లో అప్పటి ప్రభుత్వం జీవో-570 జీవో జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ బాలోజీ బదావత్ సహా 30 మంది అభ్యర్థులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు డివిజన్ బెంచ్ రిజర్వేషన్లను పాటిస్తూ 1:50 చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేయాలని తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును ఏపీపీఎస్సీ 2009లో సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. కులాలతో సంబంధం లేకుండా జనరల్ మెరిట్ ప్రకారమే ఎంపిక చేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును అమలు చేయాలని గత గ్రూప్-1 నోటిఫికేషన్ సమయంలోనే కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే న్యాయ పరమైన చిక్కులెదురుకావొద్దనే గతంలో ఉన్న జీవో-55ను సవరించి జీవో-29ని జారీచేశాం.

• అభ్యర్థుల సందేహం

> గ్రూప్-1 మెయిన్స్‌కు 1:50 కాకుండా 1:100 రేషియోను ఎందుకు అమలు చేయడం లేదు.

అధికారుల వివరణ

గ్రూప్-1 నోటిఫికేషన్‌లో 1:50 నిష్పత్తిని అమలు చేస్తామని ముందే ప్రకటించాం. జీవో-29లోనూ దీనినే స్పష్టం చేశాం. ఎలా ఎంపిక చేయాలన్న దానిపై సుప్రీంకోర్టు పిట్టా నవీన్‌కుమార్ వర్సెస్ రాజనర్సయ్య కేసులో స్పష్టమైన తీర్పు ఇచ్చింది. 2003లో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేయగా, ఏపీపీఎస్సీ 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసింది. ఆ తర్వాత కొందరు అభ్యర్థులు ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన వారిని మెయిన్స్‌కు అనుమతించాలని ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ తీర్పునిచ్చింది. దీనిని ఏపీపీఎస్సీ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా, ఇది న్యాయసమ్మతం కాదని, మధ్యలో ఇష్టానుసారంగా నిష్పత్తిని మార్చరాదని, ఎంపిక చేసిన వారిని జాబితా నుంచి తొలగించాలని తీర్పును ఇచ్చింది. దీంతో నోటిఫికేషన్‌లో ఉన్నట్లుగానే 1:50 నిష్పత్తిని అమలు చేస్తున్నాం.

• అభ్యర్థుల సందేహం

> మన పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో జీవో-5 ప్రకారం చేపడుతున్నారు కదా?

అధికారుల వివరణ

మన దగ్గర మెయిన్స్‌కు 1:50 చొప్పున ఎంపిక చేస్తుండగా, ఏపీలో ఈ విధానం అమలులో లేదు. అక్కడ కటాఫ్ మార్కులను అమలు చేస్తున్నారు. కటాఫ్ మార్కులు కమిషన్ అభీష్టం మేరకే జరుగుతుంది. కటాఫ్ మార్కుల ప్రకారం తీసిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగుల కోటాలో అభ్యర్థులు రిజర్వేషన్ ప్రకారం ఎంపిక కాకపోతే కటాఫ్ మార్కుల నిబంధనలను సడలించి ఆయా వర్గాల నుంచి మరికొందరికి అవకాశం ఇస్తున్నారు. ఇదే ఫార్ములాను జీవో-29లోనూ అనుసరించాం. యూపీఎస్సీ సైతం 1:12 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి, ఇదే తీరును అనుసరిస్తున్నది.

• అభ్యర్థుల సందేహం

> గ్రూప్-1లో మళ్లీ ఇంటర్వ్యూలు ఉంటాయా?

అధికారుల వివరణ

ఇంటర్వ్యూలు ఉండవు. ఇంటర్వ్యూలను గతంలోనే ప్రభుత్వం రద్దుచేసింది. ఇదే విధానం అమలులో ఉంటుంది.

• అభ్యర్థుల సందేహం

> గ్రూప్-1 మెయిన్స్‌కు క్వాలిఫై అయిన వారి వివరాలను క్యాటగిరీ వారిగా కటాఫ్ మార్కులను ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారు. ఎందుకు వెల్లడించడం లేదు

అధికారుల వివరణ

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు పూర్తికాగానే ఫలితాల సమయంలో పూర్తి వివరాలను ప్రకటిస్తుంది. అదే సమయంలో ప్రిలిమ్స్ కటాఫ్, మెయిన్స్ కటాఫ్. క్వాలిఫై అయిన వారి పూర్తి వివరాలను వెల్లడిస్తాం. పూర్తి పారదర్శకంగా ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాం. దీంట్లో దాపరికం, గోప్యత లేనే లేదు.

జీవో-29 ప్రకారం ఎంపిక జరుగుతుందిలా..

- తొలుత జనరల్/ఓవరాల్ మెరిట్ ప్రకారం మల్టీజోన్ వారీగా 1:50 నిష్పత్తి చొప్పున అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేస్తారు. ఈ జాబితాలో అన్ని కులాలకు చెందిన వారు ఉంటారు. ఇది పూర్తిగా మెరిట్ ఆధారంగా జరుగుతుంది.
- ఆ తర్వాత మల్టీజోన్ వారీగా రిజర్వేషన్లను అమలు చేస్తారు. ఈ విధానంలో జనరల్ మెరిట్ ప్రకారం ఎంపిక చేసిన అభ్యర్థుల్లో ఆయా రిజర్వేషన్‌లో ఎన్ని పోస్టులుంటే అన్ని పోస్టులకు 1:50 నిష్పత్తిని అమలు చేస్తారు. ఇలా ఉన్నారో లేదో పరిశీలిస్తారు.
- జనరల్ మెరిట్‌లో ఆయా రిజర్వేషన్ వారుంటే ఓకే. లేకపోతే (షార్ట్‌ఫాల్ ఉంటే) మాత్రం ఆయా నిష్పత్తి ప్రకారం ఎంత మంది కావాలంటే అంత మందిని మెరిట్ ఆధారంగానే కింది నుంచి ఎంపిక చేస్తారు. అదనంగా ఎంత మంది అవసరముంటే అంత మందిని మెయిన్స్ కోసం తీసుకుంటారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో బీఆర్ఎస్ నేతలు తుంగ బాలు, ఆంజనేయగౌడ్, రామ్మూర్తి

గ్రూప్-1 అభ్యర్థుల కటాఫ్ ఎంత?

- ఓపెన్ క్యాటగిరీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు ఎందరు?
- ఓపెన్ క్యాటగిరీ అగ్రవర్ణాలవారికేనా?
- జీవో 29 ప్రకారం రిజర్వ్ కోటాలో అన్నివర్గాలకు అన్యాయం
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): 'గ్రూప్-1 అభ్యర్థుల కటాఫ్ మార్కులు ఎన్ని? క్యాటగిరీలవారీగా ఎంపిక కటాఫ్ మార్కులు ఎన్ని అనేది ఎందుకు చెప్పడం లేదు' అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. 2022లో కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన జీవో 55ను రద్దుచేసిన రేవంత్‌రెడ్డి సర్కారు, జీవో 29ని తీసుకొచ్చి నిరుద్యోగుల నోట్లో మట్టికొడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతున్నదని, వారి హక్కులను ప్రభుత్వం కాలరాస్తున్నదని మండిపడ్డారు. సామాజిక న్యాయం కోసం కట్టుబడి ఉన్నామని రాహుల్‌గాంధీ రాజ్యాంగం పట్టుకొని తిరుగుతుంటే ఆ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయానికి తూట్లు పొడుతున్నారని విమర్శించారు. మంగళవారం తెలంగాణభవన్‌లో ఆర్ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతోపాటు స్పెషల్ క్యాటగిరీ అభ్యర్థులకు రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగంతోపాటు సుప్రీంకోర్టు సైతం అనేక తీర్పుల్లో చెప్పిందని గుర్తుచేశారు. కానీ, రేవంత్ సర్కారు తెచ్చిన జీవో 29 దీనికి తూట్లు పొడుస్తున్నదని తెలిపారు. జీవో 29 ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపడితే రిజర్వ్ కోటాలో అన్నివర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని చెప్పారు. గ్రూప్-1లో ఓపెన్ క్యాటగిరీ అంటే అగ్రవర్ణాలవారికేనా? అని నిలదీశారు. రాష్ట్రంలో గ్రూప్-1 పోస్టులు 563కుగాను 1:50 ప్రకారం మొత్తం 28,150 మందిని ఎంపిక చేయాల్సి ఉన్నదని వివరించారు. కేసీఆర్ తెచ్చిన జీవో 55 ప్రకారం ఓపెన్ క్యాటగిరీలో 40 శాతం అంటే 209 పోస్టులకు 10,450 మందిని, రిజర్వేషన్ క్యాటగిరీలో 60 శాతం అంటే 354 పోస్టులకు 17,700 మంది ఓసీ, ఈడబ్ల్యూఎస్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, స్పోర్ట్స్ కోటా అభ్యర్థులను ఎంపికచేయాల్సి ఉన్నదని తెలిపారు. కానీ, బదావత్ తీర్పు ఆధారంగా హడావుడిగా జీవో 29 తీసుకొచ్చి రిజర్వేషన్ కోటాలను పరిగణనలోకి తీసుకోకుండా ఒకే ముద్దగా 28,150 మందిని టీజీపీఎస్సీ ఎంపిక చేసిందని విమర్శించారు. ఏ వర్గాల అభ్యర్థులు ఎందరున్నారని వెల్లడించడం లేదని మండిపడ్డారు.

యూపీఎస్సీలో కూడా రిజర్వేషన్..

యూపీఎస్సీ కూడా ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూలో సామాజిక కోటాలను పాటిస్తున్నదని ప్రవీణ్‌కుమార్ చెప్పారు. కర్ణాటక, హర్యానా, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, జార్ఖండ్ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు కూడా రిజర్వేషన్లు పాటిస్తున్నాయని, వీటికి సుప్రీంకోర్టు తీర్పులు అడ్డం రావడం లేదా? అని నిలదీశారు. ఓపెన్ క్యాటగిరీలో ఎంపిక చేసిన 10,400 అభ్యర్థుల్లో ఏ వర్గాలకు చెందిన వారు ఎంత మంది ఉన్నారనే లెక్కలను ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. ఇదీ కాకుండా 3,232 మందిని అదనంగా ఏ ప్రాతిపదికన తీసుకున్నారనేదీ సీఎస్, టీజీపీఎస్సీ, రేవంత్‌రెడ్డి చెప్పడం లేదని మండిపడ్డారు. మెరిట్ అభ్యర్థులు అంతా ఓపెన్ క్యాటగిరీలోకి వస్తే మరో 14 వేల మంది అర్హత పొందే అవకాశం ఉన్నదని, వీరందరికీ అన్యాయం జరుగుతున్నదని విమర్శించారు. అ అంశంపై ప్రభుత్వం పునరాలోచించాలని, లేకుంటే బీఆర్ఎస్ తరపున మళ్లీ విజ్ఞాపనలు చేస్తామని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు తుంగ బాలు, ఆంజనేయగౌడ్, బొమ్మెర రామ్మూర్తి పాల్గొన్నారు.

మెడికల్ సీట్లలో తెలంగాణ బిడ్డలకు అన్యాయం

స్థానికత నిబంధనలు వెనక్కి తీసుకోవాలి: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): స్థానికత విషయంలో తీసుకొచ్చిన కొత్త నిబంధన వల్ల మెడికల్ సీట్లలో తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే ఈ నిబంధనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానికత విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరు అనేక అనుమానాలకు తావిస్తున్నదని పేర్కొన్నారు. జీవో-33 ప్రకారం నిర్దేశించిన స్థానికతలో ని అంశాలు ప్రభుత్వం వేలితో విద్యార్థుల కండ్లను పొడిచినట్టే ఉన్నాయని మండిపడ్డారు. 9 నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదివిన విద్యార్థులే స్థానికులు అవుతారని ప్రభుత్వం చెప్తున్నదని, దీంతో చాలామంది ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో లోకల్ అవుతారని ఆందోళన వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు ఉన్నందున ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు చాలామంది ఇక్కడే విద్యాభ్యాసం చేస్తున్నారని, కొత్త నిబంధనల ప్రకారం వారంతా తెలంగాణలో లోకల్ అవుతారని, అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లో చదివే తెలంగాణ విద్యార్థులు నాన్‌లోకల్ అయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. 2023-24 వరకు 6 నుంచి 12 తరగతి వరకు నాలుగేండ్లు గరిష్ఠంగా ఎక్కడ చదివితే అదే స్థానికతగా గుర్తించిన విషయాన్ని కేటీఆర్ ఉదహరించారు. దాంతో మన విద్యార్థులు ఇంటర్మీడియెట్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినా వారు లోకల్‌గానే పరిగణించబడేవారని వివరించారు. వేలాది మంది ఇతర రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలో లోకల్ అవుతారని, మన విద్యార్థులు మెడిసిన్ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు.

జీవో 33ని ఉపసంహరించుకోవాలి

వైద్య విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు విడుదల చేసిన జీవో 33తో విద్యార్థులు నష్టపోతున్నారని, ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తెలంగాణ వైద్య విద్యార్థుల పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవిప్రసాద్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. గతంలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు.. ఏడేండ్లలో నాలుగేండ్లు తెలంగాణలో చదివితే స్థానికత ఉన్నట్టుగా గుర్తించేవారని, ఇప్పుడు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు వరుసగా 4 ఏండ్లు చదివితేనే స్థానికులుగా గుర్తించడం సరికాదని వాపోయారు.

పాత వెసులుబాటు గడువు ముగిసింది

జీవో 33పై వైద్యారోగ్యశాఖ వివరణ

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్ అడ్మిషన్లలో జీవో 33కి సంబంధించి వైద్యారోగ్యశాఖ వివరణ ఇచ్చింది. గతంలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేండ్లు చదివిన ప్రాంతాన్ని లోకల్‌గా నిర్ధారించే వెసులుబాటుకు కాలపరిమితి ముగిసినట్టు పేర్కొన్నది. 2017లో ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని గుర్తుచేసింది. రాష్ట్రంలో 15 శాతం ఉమ్మడి కోటా కింద ఉండేదని, ఏపీ, తెలంగాణ విద్యార్థులు మెరిట్ ప్రకారం ఈ సీట్లు పొందేవారని పేర్కొన్నది. స్థానికత నిర్ధారణకు 2 రకాల నిబంధనలు ఉండేవని వెల్లడించింది. మొదటి ఆప్షన్‌లో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు వరుసగా నాలుగేండ్లు చదివిన ప్రాంతాన్ని లోకల్‌గా, రెండో ఆప్షన్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడేండ్లలో వరుసగా నాలుగేండ్లు చదివిన ప్రాంతాన్ని లోకల్‌గా నిర్ధారించారని పేర్కొన్నది. ఈ ఏడాది జూన్ 2తో ఉమ్మడి కోటా రద్దయినప్పుడే స్థానికత రెండో వెసులుబాటు కూడా రద్దయిందని వెల్లడించింది.

నల్లా కనెక్షన్లలో తెలంగాణ ఫస్ట్

మొదటిపేజీ తరువాయి...

భగీరథ పథకం ద్వారా ఇది సాధ్యమైంది. వివిధ రాష్ట్రాల్లో ఇంటింటికీ నల్లా కనెక్షన్లపై జల్ జీవన్ మిషన్ (జేజేఎం) ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నది. జేజేఎం పథకం (2019 ఆగస్టు 15) ప్రారంభించడానికి ముందే తెలంగాణలో 15.68 లక్షల (29.05 శాతం) గ్రామీణ కుటుంబాలకు ట్యాప్ కనెక్షన్ ఉన్నది. 2019-20 సంవత్సరంలో 20.18 లక్షలు, 2020-21 సంవత్సరంలో 18.12 లక్షల గ్రామీణ కుటుంబాలకు అంటే మొత్తం 53.98 లక్షల (100శాతం) గ్రామీణ కుటుంబాలకు నల్లా కనెక్షన్ల ద్వారా తాగునీటి సరఫరా జరిగింది. యూటీలో అండమాన్ నికోబార్, చిన్న రాష్ట్రాల్లో గోవా మనతోపాటు 2020-21 నాటికే 100 శాతం గ్రామీణ కుటుంబాలకు నల్లా కనెక్షన్లు ఇచ్చాయి. పంజాబ్, గుజరాత్ వంటి పెద్ద రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ నాలుగేండ్ల క్రితమే ప్రతి గ్రామీణ కుటుంబానికి నల్లాల ద్వారా రక్షిత మంచినీరు ఇచ్చిన రాష్ట్రంగా నిలిచింది. తెలంగాణలో 53.98 లక్షల గ్రామీణ కుటుంబాలు ఉండగా 2020-21 నాటికే అన్ని కుటుంబాలకు నల్లా కనెక్షన్ ద్వారా సురక్షిత తాగునీరు అందించినట్టు కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. ఇద్దరు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆ శాఖ మంత్రి సోమవారం సమాధానం ఇచ్చారు. గ్రామీణ కుటుంబాలకు అందించే నల్లా కనెక్షన్లలో దేశ సగటు 77.83% మాత్రమే. తెలంగాణతోపాటు 11 రాష్ట్రాలు/యూటీలు ప్రతి ఇంటికి (100శాతం) నల్లా కనెక్షన్ ద్వారా తాగునీటిని అందించే రాష్ట్రాలుగా మారాయి. ఇందులో తెలంగాణ, గోవా, గుజరాత్, హర్యానా, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరాం, పుదుచ్చేరి, దాద్రానగర్‌హవేలి, అండమాన్ నికోబార్ దీవులు ఉన్నాయి. దేశంలో రాజస్థాన్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాల్లో 33 శాతం, మరికొన్ని రాష్ట్రాల్లో 67 శాతం గ్రామీణ కుటుంబాలకు నల్లా కనెక్షన్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల ట్యాప్ కనెక్షన్లలో పశ్చిమబెంగాల్ అట్టడుగున ఉన్నది. ఆ తర్వాత రాజస్థాన్, కేరళ, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలు వరుసగా ఉన్నాయి.

ఆగస్టు 1నాటికి గ్రామీణప్రాంతాల్లో నల్లా కనెక్షన్లు ఉన్న రాష్ట్రాలు (శాతాల్లో)



భారతదేశం 77.83%

2019 ఆగస్టు నాటికి 16.08 శాతమే

జల్‌జీవన్ మిషన్ ప్రారంభించిన 2019 ఆగస్టు నాటికి దేశవ్యాప్తంగా 3.23 కోట్ల నివాసాలకు (16.08 శాతం) మాత్రమే నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 41.41 లక్షల కనెక్షన్లు కలుపుకొని 2024 ఆగస్టు 1 నాటికి దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని గ్రామీణ ప్రాంతంలో ఉన్న 12.80 కోట్ల నివాసాలకు ట్యాప్ కనెక్షన్లు ఇచ్చారు. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 19.32 కోట్ల నివాసాలు ఉండగా, ఇందులో 15.03 కోట్లకుపైగా (77.83 శాతం) నివాసాలకు ట్యాప్ కనెక్షన్ ద్వారా రక్షిత తాగునీరు అందుతున్నది.

రూ.40 వేల కోట్ల 'భగీరథ' ఫలితం

ఇంటింటికీ నల్లా ద్వారా నీరందించే భగీరథ పథకానికి తెలంగాణ ప్రభుత్వం దాదాపు రూ.40 వేల కోట్లు ఖర్చుచేసింది. తెలంగాణకు జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.188.23 కోట్లు విడుదలచేశారు. కృష్ణా, గోదావరి నదులతోపాటు ఇతర జలాశయాలను కలిపి 1.30 లక్షల కిలోమీటర్ల పైప్‌లైన్ మార్గం ద్వారా రాష్ట్రంలోని 24 వేల గ్రామాలు, 65 పట్టణాల్లోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించింది. అనేక రాష్ట్రాలు ఈ పథకాన్ని ఆదర్శంగా తీసుకున్నాయి. తమ రాష్ట్రాల్లో ఈ ప్రాజెక్టులను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన జల్ జీవన్ మిషన్‌కు కూడా తెలంగాణలోని భగీరథ ప్రాజెక్టు స్ఫూర్తిగా నిలుస్తున్నది.

హాల్‌మార్క్ ఆభరణమే కొనాలి

- రాష్ట్రంలో 12 జిల్లాల్లో తప్పనిసరిగా అమల్లోకి
- నిబంధనలు పాటించని వర్తకులపై బీఐఎస్ చర్యలు
- హాల్‌మార్కింగ్ ఖర్చు జీఎస్టీతో కలిపి రూ.45 మాత్రమే

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): నకిలీ, కల్తీ బంగారు ఆభరణాలు కొని వినియోగదారులు మోసపోకుండా భారతీయ ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) నిబంధనలను మరింత కట్టుదిట్టం చేస్తున్నది. దేశవ్యాప్తంగా బంగారం అమ్మకాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. ప్రతి ఆభరణం శుద్ధతను పరీక్షించిన తర్వాతే ఓ ప్రత్యేక కోడ్ కేటాయించి విక్రయానికి అనుమతి ఇస్తున్నది. రాష్ట్రంలోనూ హైదరాబాద్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టింది. బీఐఎస్ ఆమోదం లేని, హాల్‌మార్క్ ముద్రలేకుండా బంగారు ఆభరణాలు అమ్మే వారిపై చర్యలు తీసుకుంటున్నది.

హాల్‌మార్క్ అంటే..

బంగారం, వెండి వంటి విలువైన ఆభరణాల శుద్ధతను నిర్ధారించేందుకు భారత ప్రభుత్వం హాల్ మార్కింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. చిన్న దుకాణం నుంచి కార్పొరేట్ వర్తకుల దాకా ప్రతి ఒక్కరు ప్రతి ఆభరణంపై హాల్‌మార్క్ ముద్రించిన తర్వాతే అమ్మాలి. ప్రతి ఆభరణాన్ని తయారీదారులు దగ్గరలోని బీఐఎస్ ఆమోదిత అసేయింగ్, హాల్‌మార్కింగ్ కేంద్రానికి తరలిస్తారు. అక్కడ శుద్ధత పరీక్షల అనంతరం ప్రతి ఆభరణానికి బీఐఎస్ కంప్యూటర్ ఆధారిత ఐడీ నంబర్‌ను కేటాయిస్తుంది. దీన్నే హాల్‌మార్కింగ్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (హెచ్ యూఐడీ)గా పరిగణిస్తారు. బరువు, రకంతో సంబంధం

లేకుండా కొనే ప్రతి ఆభరణంపై మూడు ముద్రలు (1.బీఐఎస్ లోగో, 2.ఆభరణం క్యారెట్లు, శుద్ధత, 3.హెచ్‌యూఐటీ నంబర్ ఆరు అంకెలు) ఉంటేనే అది హాల్‌మార్క్ బంగారంగా గుర్తించాలి.

బీఐఎస్ కేర్ యాప్‌తో నాణ్యత నిర్ధారణ

బంగారు ఆభరణాల శుద్ధతను వినియోగదారులు స్వయంగా పరిశీలించుకొనేందుకు బీఐఎస్.. బీఐఎస్ కేర్ అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌లో ఆభరణం నాణ్యతను తెలుసుకోవచ్చు. హాల్‌మార్కింగ్ కేంద్రాలు అందుబాటులో ఉన్న ఉమ్మడి జిల్లాల పరిధిలోని 12 జిల్లాల్లో హాల్‌మార్కింగ్